# ఓసారి మనసు చెప్పేది విందామా!

-పాండ్రంకి సుబ్రమణి

**హో**లు మధ్య అరల ఆకృతిలో ఉన్న ఎన్‌క్లోజ్డ్ రూములో మాధాపూర్ కంపెనీ వాళ్ళ ఇన్వాయిస్ పేపర్లను త్వరతి గతిన పూర్తిచేయాలన్న పూనికతో అంశాలన్నిటినీ తదేకంగా పరీక్షిస్తూ కూర్చున్నారు రామచంద్రమూర్తి. కొత్తగా చికాగో నుంచి తరలివచ్చిన ఆ కంపెనీ వివిధ రకాల ప్రోడక్టుల సప్లయి కోసం అర్జంట్ పర్చేజ్ ఆర్డరు ప్లేస్ చేసింది. కొన్ని ప్రోడక్టులు ముంబాయి బ్రాంచి నుంచి రవాణా చేయాలి. మరికొన్ని ఇక్కడ్నించే అందజేయవచ్చు. 'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్'- ముందు ముందు వాళ్ళతో కొనసాగించబోయే లావాదేవీలపై ఈ సూత్రమే ఆమెదముద్ర వేస్తుందని అతడికి తెలుసు. అదిచ్చే టర్న్ ఓవర్ చిన్నదా పెద్దదా అన్నది కాదు విషయం. అర్ఘ్య పాత్రలా అందిచ్చిన ఆర్డర్‌ని ఒక సముచిత తరుణంగా మలచడంలోనే ఉంది వ్యాపార దక్షత.

ముమ్మరంగా పనిచేయడమంటే గుర్రపు స్వారీ చేసే జాకీలా ఉత్సాహ పూరితంగా ఉరకడం రామమూర్తి నైజం. మొదటి లిస్టు హైదరాబాదు బ్రాంచీకి స్పెషల్ మెసెంజరు ద్వారా పంపించి- మరొక లిస్టుని ముంబాయి బ్రాంచికి ఫాక్స్ చేసి, ఆ భోగట్టాను ఎన్ఆర్ఐ వాళ్ళ కంపెనీకి ఫోన్ ద్వారా అందిచ్చి- ఇన్వాయిస్ రిజిష్టర్లు అప్‌డేట్ చేసి రిలాక్సుగా రివాల్వింగ్ చైర్‌లో చేరబడి, ప్రక్కనున్న కాఫీ కప్పుని చేతిలోకి తీసుకున్నాడు. రెండు చుక్కల్ని నాలిక చివర వేసుకున్నాడో లేదో- ప్యూను వచ్చి- "సార్! మిమ్మల్ని జియమ్ గారు పిలుస్తున్నారు" అని చెప్పి వెళ్లిపోయాడు. వాట్- డిజియమ్ గారా లేద జియమ్ గారా పిలిచేది?" అంటూనే కాఫీ కప్పుని బల్లపైన ఉంచి లేచాడు రామచంద్రమూర్తి.

అతడికి గొంతు తడారిపోయినట్లనిపించింది. అతడి పనితనాన్ని గమనిస్తూ అజమాయిషీ చేయడానికి సేల్స్ డిజియమ్, ప్రాడక్టు డిజియమ్, అడ్మినిస్ట్రేటివ్ డిజియమ్- వెరసి ముగ్గురు పైమెట్టున ఉన్నారు. మరి తనతో జియమ్ గారికేమి పనో!

వదులు చేసిన టైని సరిచేసుకుంటూ, జియమ్ గారి గదిలోకి ప్రవేశిస్తూ- "గుడ్ మార్నింగ్ సార్!" అని విష్ చేశాడు. జియమ్ తలెత్తి చూసి ముడతలు పడ్డ ముఖంతో సూటిగా చూసి- ఎదురుగా కూర్చోమన్నట్లు సీటు చూపించారు. "థేంక్స్" అంటూ కూర్చొని ఆయన ముఖంలోకి తేరిపార చూడసాగారు రామచంద్రమూర్తి. చావు కబురు చల్లగా చెప్పినట్టు- పోస్టింగ్ కమ్ ట్రాన్సఫర్ ఆర్డర్‌గాని చేతికివ్వరు కదా!

"మీరు న్యూ యేజ్ టెలికమ్యూనికేషన్ కంపెనీకి వెళ్ళారా?" ఆశ్చర్యంతో రవంత వెనక్కి తగ్గుతూ- "వాళ్ళడిగిన ప్రోడక్టు మూడు రోజుల క్రితమే సప్లయ్ చేశాం సార్. ప్రోడక్టు కాస్ట్ రేంజ్ ఐదున్నర లక్షలకు పైగా ఉండటాన ఫైలు కూడా మీకు పంపించాం సార్" అన్నాడు. జియమ్ రవంత అసహనంగా చూసి "నేనడిగింది అది కాదు మిస్టర్ మూర్తీ! వాళ్ళ వైస్ ప్రెసిడెంటు గారు ప్రోడక్టు ఆనుపానుల గురించి స్వయంగా తెలుసుకోవాలన్నారు. సేల్స్ డిజియమ్ గారు ఆ జాబ్ మీకప్పగించారు. అవునా?"

"ఎస్ సార్. మన సీనియర్ ఎగ్జిక్యూటివ్ అక్కడికి వెళ్ళి వచ్చారు."

"యు ఆర్ నాట్ క్యాచింగ్ మై పాయింట్ మిస్టర్ రామచంద్రమూర్తీ! మిమ్మల్ని మాత్రం అక్కడకు వెళ్ళి రమ్మనమని అడిగాం. దానికి కారణం ఉంటుందని మీరు గ్రహించారా?" రామచంద్రమూర్తి బదులివ్వకుండా ఊరకుండిపోయాడు.

విరుద్ధ వాతావరణంలో వెల్లువెత్తిన విషమ పరిస్థితిని అర్థం చేసుకుని "సారీ సార్" అన్నాడు. "మళ్ళీ ఇటువంటి పొరపాటు దొర్లకుండా చూసుకోండి. అంత పెద్ద సీనియర్ ఆఫీసర్ వద్దకు వెళ్ళి మాటామంతీ కలపడానికి- వివరాలందివ్వడానికి తాహతు ఉండాలి. మోతాదుకి మించని బాడీ లాంగ్వేజ్ కలిగి ఉండాలి. ఇవన్నీ మీ వద్ద ఉన్నాయన్న నమ్మకం తోటే మిమ్మల్ని మాత్రం అక్కడకు వెళ్లిరమ్మన్నాం. వాళ్ల వీపీగారు మళ్లీ ఫోన్ చేశారు. మీరు బాగా వివరించ గలరన్న కితాబు కూడా ఇచ్చారు. ఎంతటి అర్జంటు పని చేతిలో ఉన్నా- మీరెక్కడిదక్కడ విడిచి మీ డిజియమ్ గారికి ఓ మాట చెప్పి ఇప్పుడే న్యూ యేజ్ టెలి కమ్యూనికేషన్స్‌కి వెళ్తున్నారు. మీరక్కడికి చేరిన తర్వాత మరే ఇతర జూనియర్ ఆఫీసర్‌నూ కలుసుకోరు. వీపీ గార్ని మాత్రమే కలుస్తారు. వీపీగారికి

మాత్రమే వివరాలు అందజేస్తారు." రామచంద్రమూర్తి ఇక మారు పలక్కుండా లేచి- "అలాగే సార్! సారీ ఫర్ ది డిస్టర్బెన్స్" అంటూ బయటకు కదిలాడు.

రామచంద్రమూర్తికి వెళ్లాలనిపించలేదు. అసలు ఆఫీసులో కూర్చోవాలని కూడా అనిపించడంలేదు. నషాళానికి తాకిన అసహనంతో నరాలు కణతల్లో ఉబ్బాయి. పళ్ళు గిట్టకరచుకున్నాడు. ఏసీలు నలు వైపులా చల్లదనాన్ని విరజిమ్ముతున్నా ముఖాన చిరు చెమటలు బొట్లు బొట్లుగా ప్రోగుచేసుకున్నాయి. ఆ కంపెనీ వీపీ తనను మాత్రమే ఎందుకు పిలుస్తుందీ ఇక్కడి వాళ్ళకెవరికైనా తెలిసి ఏడిస్తే కదా! ఓ ఖండిత శిలా విగ్రహం జీవన ఆలయ ప్రాంగణాన సజీవ శిల్పమై నిటారుగా నిల్చోవాలని స్వప్నిస్తుంది. ఏనాడో వాడిన మహా పుష్పం మహదేవుడి జటాజూటానికి చేరి వికసిత శోభతో నర్తించాలని అర్రులు చాస్తుంది. తనను మదోన్మత్త భ్రమరంలా మార్చి తన చుట్టూ తిప్పుకోవాలని వ్యూహరచన చేస్తుంది. మొదట మృదు భావన- తరవాత కమ్మని సయ్యాట కల్పన- చివరన లాలనతో తనను ఊబిలోకి దింపడానికి పన్నాగం పన్నుతుందా వయ్యారి మగువ. ఈ వివరాలన్నీ- నిగూఢ రహస్యాలన్నీ ఎవరికి విడమర్చి చెప్పగలడు! రామచంద్రమూర్తి ధ్యాన నిష్ఠతో ముమ్మార్లు ప్రణవ నాదాన్ని పలికి అసంకల్పితంగా జేబు నుంచి పర్సు తీసి విప్పి కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు. బుజ్జిగాడు- బుజ్జి తల్లి - తల్లి మెడచుట్టూ చేతులు పోనిచ్చి- ముఖాలు చాటంత చేసుకుని కల్లాకపటం ఎరక్కుండా నవ్వుతున్నారు. రుక్మిణి బిడ్డలిద్దరినీ వాటేసుకుని మురిసిపోతుంది. ఇదికాదా- జీవన చైతన్యానికి- నవజీవన ఉత్తుంగ తరంగానికి నిలువెత్తు ప్రతీక!

❖ ❖ ❖

"గుడ్ మార్నింగ్ మేడమ్!" అన్న గొంతు విని తన స్టెనోకి ఏదో వ్యాపార లేఖ డిక్టేట్ చేస్తున్న వైస్ ప్రెసిడెంట్ దీపాంకిత తలెత్తి చూసి, "గుడ్ మార్నింగ్" అంటూ ప్రత్యుత్తరం యిచ్చి, సాదరంగా లేచి నిల్చుని ఎదురు వెళ్ళింది. ఆమె చూసిన మాటా మన్ననా గమనించి- వచ్చిన వారెవరో వి.ఐ.పి. అయుంటారని తీర్మానించుకుంటూ డిక్టేషను తీసుకుంటున్న స్టెనోతో పాటు- ప్రక్కన కూర్చుని ముఖ్యమైన రిఫరెన్సులు అందిస్తూ సహాయం చేస్తున్న ఇద్దరు డిప్యూటీ మేనేజర్లు సీట్ల నుంచి లేచి నిల్చుని బయటకు నడిచారు.

"మిమ్మల్ని మూడు రోజుల క్రితం పిలిచాను మిస్టర్ రామచంద్రమూర్తి గారూ!" అంటూ కంఠస్వరాన్ని రవంత సాగదీస్తూ సోఫా వైపు చేయి చూపించి అతడికి దాదాపు తగిలేంత దగ్గరకు వచ్చింది దీపాంకిత. మంచు కొండలా చలించకుండా నిల్చున్నాడు రామ చంద్రమూర్తి. తెరతెరలుగా ముంచుకొస్తున్న అసహా నాన్ని దిగమింగేందుకు ప్రయత్నిస్తూ- "మా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఈ విషయమై ఓసారి వచ్చి వెళ్ళినట్టు న్నారు మేడమ్" అన్నాడు.

"ష్యూర్- అందరూ మీలా చతురత చూపించ లేరుగా! కొత్త ప్రొడక్టు గురించి కొన్ని వివరాలు అడిగి తెలుసుకోవాలని పిలిపించాను. డుయూ మైండ్ మిస్టర్ రామ్!" ఆమె మాటల్లోని తీవ్రతను గమనించి- "మేం ఇంటీరియర్ రూములో వెయిట్ చేస్తాం మేడమ్!" అంది స్టెనో. దీపాంకిత అవసరం లేదన్నట్టు తల అడ్డంగా తిప్పి మెసేంజర్‌ని మాత్రం పంపించమంది. ఆమె ఆదేశాన్ని అందుకున్న ముగ్గురూ అక్కడ్నించి నిష్క్రమించారు. ఈసారి రామచంద్రమూర్తి వెళ్లి సోఫాలో కూర్చున్నాడు- రెండు చేతులూ కట్టుకుని, ఆమె వెళ్ళి విజిటర్ల రాకను నిరోధించేలా రెడ్‌లైట్ వెలిగించి వచి అతడి ప్రక్కన కూర్చుంది. గుండె లోతున చెలరేగిన కల్లోలిత సముద్రాన్ని ఏమాత్రం గమనించనట్లే- ఆమె అతడి కళ్ళల్లోకి తదేకంగా చూస్తూ కూర్చుంది. ఆమె చూపులు అతడికి ఎడారి

## నీ కోసం..

కోటి ఆశల ప్రభలతో
తెలుగింటి యిల్లాలు
గుమ్మాలకు
మామిళ్ళ మొలిపించి
తారకలను
ముంగిట
రంగవల్లుల్లో బంధించి
కళ్లల్లో దివ్వెలు
వెలిగించుకొని
స్వాగతిస్తోంది
ఉగాదీ!
యుగాదిగా నీవు
మా ఆశల గాదివి!!

-బద్ది నాగేశ్వరరావు

ఇసుక రేణువుల్లా తాకుతున్నాయి. మెసెంజరు వచ్చి వాళ్ళకు దగ్గరగా టీపాయ్ పైన టీలు, బిస్కెట్లూ పెట్టి వెళ్ళిపోయాడు. ఆ తరువాత అతను ఉగ్గబట్టలేక పోయాడు. రక్తప్రసారంతో ఉబ్బిన కణతల్ని చేతి గుడ్డతో అదుముకుంటూ ఉన్నపాటున లేచి నిల్చుని

## జెముడు పొద

శృంగారానికీ బూతుకూ మధ్య
తెర ఉండేది
ఇప్పుడు తెరలన్నింటా
బూతే!!
పెద్దల్ని
గౌరవించాలా?!
గదిగోడకు దిగ్గొట్టు
నడిరోడ్లో నిలబెట్టు!!
తమసోమా
జ్యోతిర్గమయ-
శలభానికిది
శాపగీతమేనయ!!
అర్ధరాత్రి నిర్భయంగా
కాల్‌గాళ్
భయంభయంగా
కాల్ సెంటర్ గాళ్!!
పంచభూతాలు
పాండవుల్లాంటివి
కలుషితం చేస్తే
కౌరవులే అవి!
కాలం చెల్లింది వాడికే
కాలానికి కాదు
మృతుడి చేతికి
ఆగని వాచీ!
దినదినానికీ
దినపత్రికలు
'చది'వేవిపోయి
'చూసే'వైపోతున్నాయి
అందమైన కైతకు
స్పందించని ఎద,
వసంతాన్ని చూళ్ళేని
జెముడు పొద!!

-గేరా

"వాట్ యు వాంట్ ఫ్రం మి?" అని కటువుగా అడిగాడు. అతని ఆకస్మికోద్రేకానికి నివ్వెరపోతూ ఆమె కూడా లేచి నిల్చుని- "నథింగ్. ముందు మీరు కూర్చోండి" అంది నిదానంగా. "ఎందుకు?" రెట్టించాడు. "మీతో విడిగా కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. ఎన్నిసార్లు కాంటాక్టు చేసినా తిప్పి కొడ్తున్నారు" అది విని అతను ముఖం చిట్లించాడు.

"మన మధ్య వ్యవహారమే లేనప్పుడు ముఖ్యమైన విషయమెలా పుట్టుకొస్తుంది?"

"చాలా ఉంది. కొన్ని సంబంధాలు కాదన్నంత మాత్రాన ఎగిరిపోయేవి కావు. మాసిపోయేవి కావు."

"దిస్ ఈజ్ నథింగ్ బట్ అబ్‌సర్డ్. నీది బిజినెస్ స్పీచ్. మామూలు కంపెనీ లావాదేవీల పేరిట నువ్వు నన్ను విసిగించడం మాత్రమే కాదు- లిటరల్లీ స్పీకింగ్ - నన్ను వేధిస్తున్నావు. నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నావు. మా బాస్‌ల ముందు నవ్వులపాలు చేస్తున్నావు. నెవర్ ఎగైన్!" రామచంద్రమూర్తి కసిగా చూస్తూ తలుపు వేపు దూసుకువెళ్ళాడు.

దీపాంకిత అతడికి అడ్డంగా వెళ్ళి నిల్చుంది. "అందమైన పెళ్ళాం ఇంట్లో ఎదురు చూస్తూంది కాబోలు. అయినా అంతటి వేగిరపాటు తగదు. ఒకసారి ఇటు చూసి చెప్పండి, మన మధ్య ఎటువంటి సంబంధమూ లేదు. మన మధ్య ఎటువంటి అంకురమూ మొలకెత్తలేదు. అంతేనా?" ఈ మాట విని రామచంద్రమూర్తి కంపనతో ఊగిసలాడాడు. తరలి వచ్చిన పెను అలవంటి ఆవేశంతో- "యూ బిట్చ్- నువ్వు నన్ను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా?" అంటూ చాచి లెంపకాయ కొట్టారు. "అబ్బా" అంటూ ఆమె చెంప తడుముకుంటూ సోఫాలోకి వెళ్ళి కూర్చుండి పోయింది. ఎర్రబడ్డ కళ్ళనుంచి కారుతున్న కన్నీరు ఆమెను తడిపేస్తున్నది. తన ఉద్రేకపూరితమైన చేష్టకు తనే ఖంగుతిన్నట్లు నిశ్చేష్టుడై కొన్ని క్షణాలు తన కుడిచేతిని పరీక్షగా చూసుకున్నాడు. అసంకల్పితంగా చేయి వణుకుతోంది. ఆవేశపు పొంగుతో కొట్టుకుపోతూ ఒక ముఖ్య ప్రాథమిక సూత్రాన్ని విస్మరించాడు. ఆమె ఆ కంపెనీలో స్థానబలంతో ఉన్న వైస్ ప్రెసిడెంట్. కోపాన్ని అధిగమించడానికి అతను ఒకటి-రెండు-మూడు అన్న అంకెల్ని మనసున చదవడం మరిచాడు. అయినా అతను వెనుదిరిగి చూడలేదు. "సారీ" చెప్పలేదు.

"ఒక్క నిమిషం ఆగండి మిస్టర్ రామచంద్ర

మూర్తీ!।" అతని కాళ్ళు ఆగిపోయాయి. మీతో ఏ సంబంధమూ లేని ఆడదానిపై ఎలా చేయి చేసుకోగలిగారు- మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. మళ్లీ చెప్తున్నాను- బాగా వినండి. మీతో కొన్ని ముఖ్యమైన సంగతులు చెప్పాలి. అవి మీకు మాత్రమే చెప్పాలి. అంతా విన్న తరువాత మీరేమి చేయదల్చుకున్నారో అదే చేయండి."

"ఆ చెప్పదలచుకున్నదేదో నీ అమెరికన్ యూరోపియన్ ఫ్రెండ్సుతోనే చెప్పొచ్చుగా. మాలా కాకుండా ఫ్రీగా ఉంటారు- ఫ్రెండ్లీగా ఉంటారు." ఆ మాట విని ఆమె రెండు కళ్ళూ పెద్దవయ్యాయి. ఆ ఒక్క మాటా ఓ గునపపు పోటుగా వచ్చి తాకినట్లు ఆమె గుండెపై చేయి పెట్టుకుంది. ఆమె మెల్లగా అతడ్ని సమీపించి, చేతిపై చేతినుంచి- "ఏమైనా అనండి. కసిదీరా అనండి. నాకు మాత్రం ఒక్క అవకాశం ఇవ్వండి- మనసులోనిదంతా మీ ముందు గుమ్మరించడానికి. లేకపోతే రేపో మాపో నా గుండె బద్దలయిపోతుందిరా రామూ!"

"నీకున్నది గుండె అయితేనే కదా- బ్రద్దలు కావడానికి. ఒకవేళ నేను రాకపోతే!"

"సిగ్గు విడిచి మళ్లీ మళ్లీ ఫోను చేస్తూనే ఉంటాను. అవసరమని తోస్తే మీ ఆవిడ సహాయం కూడా అర్థిస్తాను."

"ఆవిడతో నీకేం సంబంధం?"

"బాగా అన్నారు. ఆవిడతో నాకెటువంటి సంబంధమూ లేకపోతే- దానర్థం- మీతో మాత్రమే నాకు సంబంధం ఉన్నట్లు లెక్క కదా!"

"విద్యాధికురాలివి. వివరం తెలిసిన దానివి. ప్రపంచం చుట్టూ తిరిగొచ్చిన దానవి. తెలివిగానే మాట్లాడతావు. నీ మాట వింటాను. నిన్ను విడిగా కలుస్తాను. కాని ఒక షరతుపైన."

విలువైన వస్తువేదో చేతికందినట్లే అంటి చేయి జారిపోతుందేమోనన్న ఆతృతతో- "చెప్పండి, ఏదైనా సరే నాకు సమ్మతమే!" అంది.

"మన జీవితంలో ఇదే మన ఆఖరి కలయిక. కాగా- మా ఆవిడ్ని ఎట్టి పరిస్థితిలోనూ డిస్టర్బు చేయకూడదు.."

"సరే- అలాగే! మరి నాకొక విషయం చెప్పాలి మిస్టర్ రామచంద్రమూర్తీ! మీ ఆవిడ మీ ఆవిడ అని చెప్పుకొంటున్నారే- మరి నేనెవర్నో!"

"ఏమీ కావు" ఇక మాటలు పెంచడం ఇష్టంలేనట్లు సర్రున తలుపు తీసి బయటకు వెళ్లిపోయాడతను.

❖ ❖ ❖

కొన్ని రోజులుగా ఎదురు పడకుండా ముఖంలోకి తిన్నగా చూడకుండానే భర్తను ఓరకంట గమనిస్తూనే ఉంది రుక్మిణి. అతడి ముఖాన ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ముఖ కవళికల్లో కాదు- వాలకంలో కూడా మధ్యలోనే అలసిపోయిన ఆటదాసరిలా డీలాగా గోచరిస్తున్నారు. ఇదెక్కడి ముఖావం- ఇదెక్కడి విచిత్ర పరిణామం. ఇంటా వంటా ఎక్కడా లేనిది. ఆమెకు కలిగిన వ్యాకులతకు అసలు కారణం- కొన్ని రోజులుగా తనను అక్కున చేర్చుకోవడం లేదని కాదు. పడకపై చేరడం లేదని కాదు. మగవాళ్ళకు పెక్కు రాచకార్యాలుంటాయని- కార్యాలయాల్లో బాస్‌లు గండర గండల్లా ప్రవర్తించడానికి వాళ్ళ మూడ్స్ అతలాకుతలమవుతుంటాయని ఆమెకు సువిదితం. సహనాన్ని సంపూర్తిగా ఆఫీసు పనులకు వెచ్చించడాన తన తండ్రి ఇల్లు చేరిన తరువాత అమ్మపై చిన్నదానికే కస్సుబుస్సుమని ఎలా లేచేవాడో ఆమెకు బాగా గుర్తుంది. కాని భర్త ఇంత దూరంగా- ఇంత నిర్లిప్తంగా- తను కాపురానికి వచ్చిన ఆరేళ్ళలో అతడెన్నడూ ఆమె కళ్ళకు అంత డీలాగా కనిపించలేదు. ప్రతిరోజూ ఏదో ఒక సమయాన గతితప్పి పోకుండా వ్యాయామం చేసే దృఢకాయుడు తన భర్త. సత్ప్రవర్తనతో సమయపాలన పాటిస్తూ ఆరోగ్యవంతమైన అలవాట్లను అలవర్చుకున్న నిండు విగ్రహం. పగలంతా యింటి పనుల్లో మునిగిపోయే తను సాయంత్రమయేనరికి ఎక్కడలేని అలనటా ముంచుకొచ్చి భర్తను రాత్రిపూట సాధ్యమైనంత మేర దూరంగా ఉంచుతుంది. పిల్లలిద్దరినీ జోకొట్టే నెపంతో వేరొక పాన్పుపై విడిగా పడుకుంటోంది. అందుచేత తన వల్ల స్పర్శానుభూతి కలిగినప్పుడల్లా అతను మదనోత్సవానికి నాంది పలుకుతారు. తెలిసీ తెలియనట్లు తన నున్నటి పాదంతో అలా అలవోకగా ఓసారి తాకితే చాలు- అతను భగ్గున పేలే డిటొనేటర్‌లా ఆవేశపు పొంగుతో ఊగిసలాడిపోతూ ఆక్రమిస్తాడు. తన ఉనికిని కనిపించనంతగా అతడిలోకి యిముడ్చుకుంటాడు. ఆమె సంసార జీవితంలోని దైనందిన అనుభవం ఇది. అటువంటి రమణీయ రసాత్మక హృదయుడు- నేడు ఎంత విచిత్రంగా మారాడు! కావాలని తన పుష్కలమైన వక్షోజాల తూగుతో వెనుకనుంచి హత్తుకునేలా కౌగలించుకున్నా- వయసు మళ్లిన

సింహంలా నిస్సత్తువుగా చూసి అటు పక్కకు ఒత్తిగిలుతున్నాడు. తనకు తెలియకుండానే తనలో యేదైనా తప్పిదాన్ని చూశాడా? ప్రసన్నత సుసంపన్నత రంగరించుకున్న వ్యక్తిత్వం కావదాన అకారణంగా తర్జన భర్జనలకు లోనవుతూ- మాంజా దారానికి రెక్కలు తెగిన పావురంలా ఆత్మక్షోభకు ఆహుతి అయే బదులు- లౌకికంతో కాస్తంత తామసించడం బంగారు తొడుగు వంటి లక్ష్యమని తీర్మానించుకుంది. మౌన శిఖరాన్ని చేరుకుని అరమోడ్పు కళ్ళతో వరధ్యాన నిమగ్నురాలవడానికి ఉద్యుక్తురాలైంది.

❖ ❖ ❖

రివర్ వ్యూ గెస్ట్ హౌస్ చేరేటప్పటికి పచ్చదనాన్ని నింపుకున్న చల్లని పిల్లగాలులు వంకీలు తిరిగిన శిరోజాల్లా పోలోమని దూసుకొచ్చాయి. ఆకాశంలో వెండి మబ్బులు చెట్టాపట్టాలేసుకుని పసందుగా పల్టీలు కొడ్తున్నాయి. మౌనంగా, ఉదాసీనంగా కనిపించే ప్రకృతి అంతరంగాన ఎంతటి సహజ సజీవ సౌందర్యం దాగి ఉంది!

గేటు వద్ద స్టూలుపై కూర్చున్న సెక్యూరిటీ గార్డు ప్రశ్నార్థకంగా చూస్తూ లేచి వచ్చి ఎవరు కావాలని అడిగాడు. "లోపల దీపాంకిత గారున్నారా?" రామచంద్రమూర్తి ప్యాంటు జేబుల్లోకి చేతులు పోనిస్తూ దవ్వున నదీ తరంగాలను చూస్తూ అడిగాడు. అంతటి నిండుతనం నింపుకున్న వాతావరణంలో అతని మనసు మాత్రం వెలితిగా, మసగ్గా ఉంది. "ఎవరు? కంపెనీ వైస్ ప్రెసిడెంటు గారేనా?" రామచంద్రమూర్తి తలూపాడు. సెక్యూరిటీ గార్డు- ఒక్క నిమిషం- అంటూ మేడ మెట్ల వైపు దారితీసే లోపల దీపాంకిత అక్కడికి రానేవచ్చింది- 'థేంక్స్' అంటూ.

"నేనొస్తానని మాటిచ్చాగా!" ఆమె వెనుక నడుస్తూ అన్నాడు. "నా థేంక్స్ మీ రాక కోసం మాత్రమే కాదు. మీరు తు.చ. పాటించే సమయపాలనకు." పూబంతి విచ్చుకున్న చందాన ఆమె ముఖం నవ్వుతోంది. అతడి ముఖాన మాత్రం చిరు అల అంతటి చిరునవ్వు కూడా కదలాడటంలేదు. మనసు మెడపట్టీ ఊడదీసుకుని పరిగెత్తడానికి సమాయత్తమయే ఆల్సేషన్‌లా వేగిర పడుతోంది.

ఇద్దరూ వి.ఐ.పి. లాంజ్‌లోకి ప్రవేశించారు. అక్కడ చుట్టుప్రక్కల అమర్చిన ఖరీదైన హంగులు- గోడకు వేలాడే ఆయిల్ పెయింటింగ్స్- అంతా దగ్గరితనం లేని అన్య వాతావరణాన్ని గుర్తుకు తెస్తోంది. లోలోన తప్పటడుగుల తత్తరపాటు కలిగిస్తోంది. పూల కుండీలలో అమర్చిన రంగు రంగుల పువ్వులు- తలలూపే పచ్చటి పత్రాలు అతడ్ని పరివేష్టించాయి. అతి కష్టమైన సుమధుర సువాసనలు ఎక్కడ్నించో ప్రవహిస్తూ అతడి ముక్కుపటాలను ఎగరేయడం గమనించి అతడు అసంకల్పితంగా తల తిప్పి చూశాడు. అవి పూర్వజన్మ వాసనలు- మల్లెపువ్వుల గుభాళింపులు. కొన్ని క్షణాలు ఊపిరి బిగబట్టి కళ్ళు రెండూ గట్టిగా మూసుకున్నాడు. ఆమె అతడి ప్రక్కన- గాలికి కూడా సందు యివ్వనంత దగ్గరగా జరిగి కూర్చుంది కాసేపు. తరువాత అతడు కనురెప్పలు తెరిచాడు. పొడవాటి ఎరుపైన విగ్రహం అతడ్ని ఒరుసుకుంటూ కూర్చుంది. ఆ రూపం అతడికి చిరపరిచితం. చూస్తుంటే అతడి కళ్ళు ఉన్నపాటున ఫెళ్ళుమని చలించాయి. ఆమె కట్టుకున్న వంగపువ్వు

## రామప్పా!

హృదయార్ద్రతను రాతిలో రంగరించావు
ఉలిన ప్రాణం నిలిపి హృద్యంగ మలిచావు!
వనిత వన్నెలు వలపు స్నానాల తేలించి
రాతిలో అందాల 'నాతి'నే తీర్చావు
ఆరాధనే బ్రతుకు గాథగా జీవించి
అమరశిల్పిగ సరస హృదయాల నిలిచేవు!
నీ మనసుదోచి తన సొగసులమరం చేసి
వెలసిన సరాగిణీ! సౌభాగ్య'నాగినీ'!
దేవాలయం - శిల్ప ప్రణయాలయమ్మదీ!
రామప్ప రమ్య కల్పనకు నిలయమ్మదీ!
రమణీయ చిత్రికల అలరారు స్తంభాలు
కనుల విందులు చేయు నయన సంరంభాలు
అసమాన శిల్ప చాతుర్యదర్పణమౌను
అగ్రగణ్యతనొంది రంగమంటపశైలి!
గర్భగుడి ద్వారబంధాలొలుకు అందాలు
అర్భకుని హృదిసైతమలరించు ఆకృతులు!
పరువాల ఉరవళ్ళు పొంగులెత్తే పడతి-
సోయగాలతో మత్తుగొలుపునా భంగిమలు!
శిలలన్ని నీ చేతి స్పర్శలో స్పందించి
కరిగి సుందర దివ్య శిల్పాకృతులు పొంద
'మయశిల్పి' మించినావూ రామప్ప!
ఘన యశస్సందినావూ రామప్ప!

-బొందిడి పురుషోత్తమరావు

చీర కూడా అతడికి పరిచితం. తన తరఫున- కాబోయే మెట్టింటి వారి తరఫున ఆనాడు- నిశ్చితార్థం నాడు ఆమెకు కట్టబెట్టిన చీర అది. చుట్టూ పుష్కలంగా కనిపించినా- లోలోన యేదో తొలిచేస్తున్నట్టు ఓ అనూహ్య ఆకృతితో వెలితి. అక్కడ్నించి లేచి ఎదుటి సోఫాలోకి వెళ్లి కూర్చున్నారు రామచంద్రమూర్తి.

"నిజం చెప్తున్నాను- హృదయం ముక్కలయి పోయేటట్లుందిరా రామూ! కొన్ని రోజులుగా చాలా బాధగా బరువుగా ఫీలవుతున్నాను. ఓ అయిదు నిమిషాల పాటు నీతో మాట్లాడవచ్చా?" అతడు బదులివ్వలేదు. గత కాలపు చిత్రాలు అతడి కనురెప్పల నడుమ ఫెళ్ళు ఫెళ్ళున మెరుస్తూ ఆకృతులుగా రూపం దాలుస్తూ తెరమరుగున కనుమరుగవుతున్నాయి. దవడలు గట్టిగా బిగించి, చూపులో చూపు పెనవేసుకునేలా దీర్ఘంగా చూసి- ఆ తరువాత మౌనంగా తలూపాడు. అంతలో అతడికేమయిందో తేల్చుకునే లోపల- అతడే మాత్రమూ ఎదురు చూడని విధంగా- ఆమె చటుక్కున లేచి వచ్చి- మోకాళ్ళపై వంగి- అతడి రెండు కాళ్ళూ చేతుల్తో చుట్టేసి వర్షించే మేఘంలా యేడ్వసాగింది- "నన్ను క్షమించరా రామూ!" అంటూ. అతను కదల్లేదు. అదే సమయాన ఆమెను దూరంగా నెట్టలేదు. అటువంటి బరువైన క్లిష్టతరమైన వాడి క్షణాలను ఓపికపట్టి భరించాలన్న తీర్మానంతోనే అతడక్కడకు దృఢతర కవచాన్ని తొడిగి వచ్చాడు. "నేను పొరపాటు చేశానురా రామూ! క్షమించరాని పొరపాటు చేశాను. నువ్వు ఎంత వద్దని వారిస్తున్నా- ఎంతగా బామాలి బ్రతిమిలాడినా ధనం తెచ్చిన అహంకారంతో కోర్టులో లాయర్ల టీము చేత అడ్డదిడ్డంగా మాట్లాడించి- నిన్నూ, మీ అమ్మగార్నీ ఓడించాలన్న బుర్రవాపుతో నీ నుంచి విడాకులు తీసుకున్నాను. నీ ప్రాణానికి ప్రాణమయిన నీ కూతుర్ని కూడా నీకు దక్కనివ్వలేదు. నా కుటుంబ జీవితంలో ఏదైనా ఒక్క మంచి గాని చేసుంటే నేనీనాడు ఇంతటి ట్రోమాకి లోనయే దానిని కాదురా రామూ!" ఈసారి రామచంద్రమూర్తి కాస్తంత దూరంగా జరుగుతూ అన్నాడు- "అదంతా గత జల సేతుబంధనం కాదా! అసలు నేను నిన్ను క్షమాపణ కోరాలని ఎప్పుడడిగా నని!" అది విని కళ్ళు తుడుచుకుంటూ ఆమె లేచి యథాస్థానాన వెళ్ళి కూర్చుంది. వేగంగా కదిలే సినీ రీలులా అదంతా అతడి కళ్ళముందు మెదిలింది. తన విద్యాసంపదతో లోలోన అణిగి ఉన్న ఆశల అంబురాన్ని అందుకోవాలన్న నిరంతర ఆరాటంతో- వలస పిట్టలా విదేశీ తీరాలకు ఆవల వాలిపోయిందా విడ. తల్లిదండ్రుల వెనుదన్నుతో బ్యాటరీ ఆఫ్ లాయర్‌ని నియమించి లక్షల్ని గుమ్మరించి ఫ్యామిలీ కోర్టులో తననూ, తన తల్లినీ బోనులో నిలబెట్టింది. మొదట ఆమె ప్రొఫెషనల్ కెరీర్‌కి తను అడ్డంగా నిలిచాడంది. ఓరోజు రాత్రిపూట ఆలస్యంగా యిల్లు చేరిందన్న అక్కసుతో- కారణాలు అడిగి తెలుసుకోకుండా ఆమెను బాబు లెంపకాయ కొట్టాడన్న మెడికల్ రిపోర్టు కోర్టు ముందుంచింది. "ఒక లెంపకాయకు ఒక డైవోర్సా! బాగుంది మీ వ్యవహారం- మీ జీవనశైలి" అని కోర్టు వారు యెద్దేవా చేయడంతో ఖంగుతిని కేసుని మరోవైపుకి మెలితిప్పింది దీపాంకిత. ఆడదాని పట్ల చులకన భావం గల తను ఆమె ఎదుగుదల చూసి సహించలేక పడకగదిలో ఆమె వద్ద శాడిజంతో ప్రవర్తిస్తున్నాడని ఎముకల్లేని రూపానికి ముక్కూ చెవులూ జోడించడానికి ప్రయత్నించింది. ఆ సన్నివేశంతో అతడు కేసు నుంచి విరమించాలని తీర్మానించాడు. కుటుంబ గౌరవం కచ్చితంగా అటకెక్కుతుందని తెలిపోయిందతడికి. కుటుంబానికి దన్నుగా చెట్టు బోదెలా నిల్చోవలసిన యింటి యిల్లాలు- అదే కుటుంబాన్ని కూకటి వేళ్ళతో కూల్చివేయడానికి పూను కున్నప్పుడు- ఇక తను చేయవల్సిందేముంది. అంచేత ఆమె డైవోర్సు పిటిషన్‌ని కోర్టువారు మన్నించవచ్చని వ్యాఖ్యానిస్తూ- లిఖితపూర్వకంగా సమర్పిస్తూ రెండేళ్ళ కారుణ్యను మాత్రం తనకు అప్పగించమని కోర్టువారికి

## నవ్వకు అలా...

నవ్వడం మనిషి లక్షణం
కానీ ఆ నవ్వులో వెటకారం
వికృత లక్షణం
ఆ తప్పు తెలుసుకోవడం మంచి లక్షణం

నిన్ను చూసి
నలుగురూ నవ్వకుండా చూసుకో
ఒకవేళ నవ్వినా
నవ్విన ఆ నలుగురూ
తమ తప్పు తెలుసుకునేలా
నిన్ను నువ్వు దిద్దుకో.

-వి. శ్రీలక్ష్మి

నివేదించుకున్నాడు. అప్పుడు కూడా దీపాంకిత ఊరు కోలేదు. విద్యాధికృత ఇచ్చిన విపరీత ఆత్మవిశ్వాసంతో తల్లిదండ్రుల ప్రోద్బలంతో కేసుని మరోమారు మెలి పెట్టింది. కారుణ్య గుండె వేగం చాలా రోజులుగా అసమతుల్యతకి లోనవుతూ వస్తోందని– ఆ కొద్దిపాటి గుండె దడకి అరిథ్మియా అని పేరుపెట్టి– ఆ చికిత్సకు

## నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం

"పుటక నీది - చావు నీది
బ్రతుకంతా దేశానిది" అన్నాడొక ప్రజాకవి
ఒక మహా నాయకుడ్ని ఉద్దేశించి
దీన్నే కొంచెం మారుద్దాం;
"పుటక మనది - చావు మనది
బ్రతుకంతా లంచానిది!"
పుట్టినప్పుడూ చచ్చేకా లంచమే
దినదినం హత్యలూ–దోపిడీలూ
నిందితులూ–బాధితులూ నీకే దాసోహం
పట్టపగలు నడిరోడ్డు మీదే హత్య
వందల మంది చూస్తారు
అయినా సాక్ష్యముండదు
పబ్లిగ్గా జరిగేదానికి సాక్ష్యమెందుకు?
చెబితే వాడిని కోర్టులోనే చంపేస్తారు
మరి!
"కేసు నిరూపించబడదు– కొట్టివేయబడుతుంది"
శిక్ష నేరానికి కాదు, న్యాయానికి
లంచాన్ని వేటాడ్డానికి 'ఏసీబీ' ఉందంటారా?
కంచే చేనుమేస్తే?
మేస్తూనే ఉంది– అందరం చూస్తూనే ఉన్నాం
"నిశ్శబ్దాన్ని ఛేదించండి"
'హెచ్ఐవీకే ఇది పరిమితం కారాదు
ప్రతి నిత్యం జరుగుతున్న
అన్యాయాలు అక్రమాలు
హత్యలూ–అత్యాచారాలు
భూకబ్జాలు - దురాక్రమణలు
అంతటా 'మహమ్మారీ' నీదే రాజ్యం! నీదే భోజ్యం!!
నిశ్శబ్దాన్ని పగలగొట్టండి! పగలగొడదాం!!
లంచగొండుల్ని అక్రమార్కుల్ని
పబ్లిగ్గా ఉరితియ్యండి! ఉరితీద్దాం!!

–కొట్టి రామారావు

అయ్యే ఖర్చు పాప తండ్రి భరించలేదని– ఆ చికిత్సకు అవసరమయే ఖర్చు ఆమె మాత్రమే భరించగలదని తన రాబడి వివరాలన్నీ తోకపెట్టి తలతీసి– కోర్టు వారిని మెప్పించి కారుణ్యను తనతో బాటు విదేశీ తీరాలకు తీసుకువెళ్ళి పోయింది. ఆ తరువాత ఎవరో చెప్పగా విన్నాడు– అమెరికాలో సెటిల్ అయి, ఎవరో ఒక అమెరికన్ థియేటరు యాక్టర్ని మనువాడి– దొర్లే రాయిలా కొద్దికాలం తరువాత అతడితో కూడా అభిప్రాయ భేదాలు కలిగి విడాకులు పుచ్చుకుని– సావకాశంగా స్వదేశం చేరుకుంది. ఇప్పుడు– ఇన్నేళ్ళ తరువాత– తను రెండవ పెళ్ళి చేసుకుని సర్వమంగళ సర్వసంపన్నురాలైన భార్యతో– ఒక మగపిల్లాడితో– ఒక ఆడపిల్లతో సంసార నావ ఒడిదుడుకులకు లోను కాకుండా నడుపుతూ వెళ్తున్నప్పుడు– అకారణంగా దీపాంకిత ఎదురొస్తూంది. అంకుశంలా వెంటాడు తోంది. కుదురుగా ఆమడ దూరాన నిల్చుని– పొడ వాటి అగ్గిపుల్లతో అదృశ్య హస్తాన్ని చాచి– తన సంసా రంలో చిచ్చుపెట్టసాగింది.

మౌనం ఓ నిమిషం దాటిన తరువాత దీపాంకిత లేచి వెళ్ళి అతడి ప్రక్కన కూర్చుంది. మెల్లగా అతడి చేతిని రెండు చేతుల్లోకీ తీసుకుంది. అతడేమీ అన లేదు. అప్పుడప్పుడు కొన్ని పరిస్థితుల ఆటుపోట్లకి గుంజాటన లేకుండా గిరగిరా తిరిగిపోకుండా చలన రహితంగా ఉండిపోవడమే శ్రేయస్కరమేమో! తను ఎలాగూ వెనుకా ముందూ తిరిగి చూడకుండా– అంతంత మాత్రంగా మిగిలిపోయిన సంబంధాన్ని తుమ్మ కొమ్మలా విరిచేయబోతున్నాడు. తెగిన రెమ్మ విరిగిన అద్దమూ ఇంకెందుకైనా పనికొస్తాయా!

"నిన్నిపుడు ఎందుకు పిలిచానో తెలుసురా రామూ!" అది విని అతడు బుసకొట్టే పాములా కస్సు మన్నాడు– "కచ్చితంగా నీతో సంసారం చేయడానికి మాత్రం కాదని నాకు తెలుసు. ఆ ఒక్క మాటా– విల్లునుండి దూసుకువచ్చిన బాణంలా ఆమెకు తగలిం దని అతడికి తెలుసు. అందుకే ముఖాన్ని అటువేపు తిప్పుకుని సంభాషిస్తున్నాడు. కొన్ని క్షణాల పాటు అవాక్కయిపోయి మౌనంగా చూస్తూండి పోయింది. చిటికెన వేలితో కనుకొలకుల్లో నిలిచిన కన్నీటి తుంప రను పారద్రోలుతూ– అతడి చేతిని తన చేతుల్లో మరింత బిగిస్తూ అంది– "నాదొక చిన్న కోరికరా రామూ! ఈ ఒక్క కోరికా తీర్చావంటే నేను నీకు జీవితాంతం రుణపడి ఉంటాను." అదేమిటన్నట్లు

ప్రశ్నార్థకంగా చూశాడు. "కారుణ్యను నీ వద్ద ఉంచుకో! ఇక దాని ఆలనా పాలనా నువ్వే చూడాలిరా రామూ!" అది విని తోక తొక్కిన పాములా సర్రున లేచి నిల్చు న్నాడు. "నీకు మతి భ్రమించింది. నా బ్రతుకు బాటలో నువ్వెలా లేవో- కారుణ్య కూడా లేదు. నీ ముఖం ఎలా చూడలేకపోతున్నానో- అదే విధంగా దాని ముఖం కూడా చూడలేను."

"మరి మా అత్తగారికి మనవరాలంటే వల్లమాలిన ప్రేమ కదా!"

"ఎవరు నీకు అత్తగారు?" అతడిలో పెల్లుబికిన ఉక్రోషాన్ని అతడిక ఆపుకోదలచలేదు. అంతేకాదు, ఇక అక్కడ ఒక్క క్షణం నిలువదల్చుకోలేదు. సంకెళ్ళు తెంచు కోవడానికి ఉరకలు వేసే హస్తిలా రొప్పుతూ బయటకు నడిచాడు. ఆమె కూడా అతడి వెనకే పరుగు వంటి నడకతో వెంబడించింది.

"అత్తగారు ఎలాగున్నారు? మీ వద్దే ఉన్నారా- పెద్ద కూతురి చెంతకు వెళ్లిపోయారా?" అతడాగి- వెనక్కి తిరిగి చూడకుండానే బదులిచ్చాడు.

"ముదిమి ముందుకొచ్చిన పెద్దావిడ మనవరాలిపై ఎనలేని మమకారం పెంచుకున్న ముదుసలి. బెంగ పెట్టుకుంది. పరలోకానికి వెళ్ళిపోయింది. ఈజ్ ఇట్ ఓకే నా!"

❖ ❖ ❖

రామచంద్రమూర్తి తన పెద్దకూతురి కలయికను అంత తీవ్రంగా వ్యతిరేకించడానికి కారణాలు లేకపోలేదు. కొన్ని నిజంగా న్యాయమైన కారణాలే! కొన్నేళ్ళుగా అంతటి సౌకర్యాలకు- అంతెత్తు జీవన ప్రమాణాలకు అలవాటు పడ్డ కారుణ్య తమతో తన భార్యకూ యేరి గంభీరంగా కనిపిస్తోందో- దానిని కారుణ్య కళ్లకు అతి స్వల్పమైనదిగా గోచరించవచ్చు. తల్లితో- అమ్మమ్మ తాతయ్యలతో బ్రాండెడ్ కార్లలో తిరిగొచ్చిన అమ్మాయికి తను ఇవ్వగలిగేది ఓ స్కూటీ మాత్రమే! ఇకపోతే సమ్మెటపెట్టువంటి మరొక కారణమూ ఉంది. కారుణ్య ముఖాన దీపాంకిత ఛాయ మాటిమాటికీ తొంగిచూడవచ్చు. తన తల్లి మరణాన్ని పదే పదే తలపింపజేయవచ్చు. దీనంగా చూస్తూ కళ్ళుమూసిన తల్లి జ్ఞాపకం మనసున మెదిలి గుండె కవాటాలను మెలితిప్పేయవచ్చు. కాగా- తనకు యిద్దరు బిడ్డలు ఉండనే ఉన్నారు కదా! వాళ్ళ బాగోగుల గురించి తలపోయడానికి భారీ దీర్ఘకాలిక ప్రణాళికలే అవసరం కావచ్చు. ముందున్నది ముసళ్ళ పండగని ఊరికే అన్నారా పెద్దలు!

❖ ❖ ❖

మూడు రోజుల టూరుపైన ముంబాయి వెళ్ళి, అదే అదనుగా అక్కడ్నించి ఊరెళ్ళి అక్కయ్యను చూసి, దానిలోనే కొన్ని ముఖ్యమైన వివరాలు సెల్ ద్వారా డిజియమ్ గారికి తెలియజేసి తిన్నగా యిల్లు చేరాడు

## మిణుగురులు

### స్వేచ్ఛ

సమ్మెలు జరగని దేశమేదో చెప్పండి
స్వేచ్ఛలేని దేశమేదో నేను చూపిస్తాను

### పిల్లలు

ప్రాణం పోసుకున్న కవితలు

### గొడుగు

వర్షం మంచివాడి మీద కురుస్తుంది
వర్షం చెడ్డవాడిమీద కూడా కురుస్తుంది
కాని మంచి వాడినే పూర్తిగా తడిపేస్తుంది
ఎందుకంటే దుష్టుడు మంచివాని గొడుగు
దొంగిలించాడు కనుక!

### సానుభూతి

తల్లిదండ్రులిద్దర్నీ హత్యచేసిన నేరస్తుడు
మరికొంతసేపట్లో తీర్పు ప్రకటించబడుతున్నదనగా
"తల్లినీ తండ్రినీ ఇద్దరినీ
ఒకేసారి జమిలిగా పోగొట్టుకున్నాను
నాపై కనికరించండి బాబయ్యా"
అంటూ జడ్జిగారితో మొరపెట్టుకుంటున్నాడు!

### ఖర్చయిపోతున్నాడు

మునిమాపువేళ
అతని దేహం మీద మొగ్గలు వికసిస్తున్న అనుభూతి
దారిపొడుగునా దీపాలు వెలిగించండి
అతను చీకట్లో తన గమ్యానికి చేరుకోలేడు!
ఎంతోమంది పేరుమోసిన డాక్టర్లు సహాయపడగా
అతను బకెట్టు తన్నేస్తున్నాడు
అది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని!

-ఏ. సూర్యప్రకాశ్

రామచంద్రమూర్తి.

భార్య అందించిన మంచినీళ్ళ గ్లాసు అందుకుని తన కోసం వచ్చిన ఫోన్ల గురించి వాకబు చేసి, ఖాళీ గ్లాసు భార్యకందించి, బ్రీఫ్ కేసుని గదిలో పదిలపరచి, అసంకల్పితంగా క్షణకాలం పాటు నివ్వెరపాటుకి లోన యాడు. ఇంటి చుట్టూ ఇంతటి నిశ్శబ్దం ఎందుకు చోటు చేసుకుందో!

స్నానం చేసి పూజగదిలోకి వెళ్లి దైవ ప్రార్థన అయిన తరువాత భార్యను తన గదిలోకి పిలిచాడు రామచంద్రమూర్తి. తలంటు పోసుకుని శిరోజాలను వదులుగా విడిచిపెట్టి, ప్రసన్న వదనంతో భర్తవేపు చూస్తూ అంది- "టిఫిన్ తినలేరూ! ఇడ్లీలు చేసి పెట్టాను. కొబ్బరి చట్నీతో నీకిష్టమని కొత్తిమీర పచ్చడి కూడా చేశాను." అతను తల అడ్డంగా ఆడిస్తూ- "ఇప్పుడు వద్దు. ముందు వచ్చి కూర్చో- కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు. ఆమె మారు మాట్లాడ కుండా చీర చెంగుని సర్దుకుంటూ వచ్చి కూర్చుంది- భర్త ముఖంలోకి తదేకంగా చూస్తూ, "కొన్ని రోజులుగా

## హైకూలు

నగ్న శిశిరం
పచ్చ చీర కట్టింది
వసంత నేస్తం!

సరిహద్దులో
ఇరువైపులా కాంతి
ఒక్కటే దీపం!

గాలిలో దీపం
నియంత్రణ కోల్పోతే
జ్వాలైనా ఖతం!

అదిగో సాక్ష్యం
వలసల ఫలితం
మురికిపేట

అల్పజీవియే
నిశిని చీల్చే యత్నం
కాంతి కీటకం!

జీవితం త్రాసు
సుఖదుఃఖాలౌతాయి
తూకపురాళ్ళు!

-పి. లక్ష్మణ్‌రావ్

నా మనసు మనసులో లేదు రుక్మిణీ! సందులేని గదిలో చిక్కుకున్న పిల్లి పిల్ల వాటంలా తయారయింది పరిస్థితి. గత కొన్ని నెలలుగా పైస్థాయిన ఉన్న ఒక సోషల్ లేడీ నాతో ఎడతెగని రభస చేస్తోంది. లిటరల్లీ స్పీకింగ్ - షి ఈజ్ హంటింగ్ మి డౌన్." ఆమె తలూపుతూ పేలవంగా నవ్వబోయి- ఇంకేదో అనబోయి- అంత లోనే ఆగిపోయింది. అతడామె పోకడ గమనించి- "ఏదైనా చెప్పాలనుకుంటున్నావా?" అని అడిగాడు. ఆమె తలూపుతూ ఓసారి అతడి ముఖంలోకి తేరిపార చూసి- "అవును. ఆవిడెవరో నాకు తెలుసు" అంది. అతడు ఆశ్చర్యంగా కనురెప్పల్ని కదలించి- "నేను లేనప్పుడు ఆవిడ యిక్కడకు వచ్చిందా?" అని అడిగాడు. "లేదు. నేను ఆవిడ ఆఫీసుకి వెళ్ళి వచ్చాను." ఈసారి ఉలికిపాటుతో చూసి మౌనంగా ఉండి పోయాడు. "ఆవిడ గురించి ఎలా తెలుసు- ఆవిడ ఆఫీసు గురించి యెలా తెలుసు?" ఆమె బదులివ్వ కుండా నిదానంగా చూస్తూ కూర్చుంది. "అసలెందుకు వెళ్ళాలి?"

"చెప్తాను. కాని ఒక రిక్వెస్టు. అలా అరిచనట్లు మాట్లాడకండి. అన్ ఈజీగా ఉంటుంది. కొన్ని రోజు లుగా మీ పరిస్థితి బాగుండటం లేదు. ఇంకా చెప్పా లంటే మీ స్థితితో బాటు యింటి పరిస్థితి కూడా దిగ జారిపోతోంది. ఒకసారి కాదు- మూడు నాలుగు సార్లు గమనించాను. సూటు వేసుకుని, సిల్క్ టై కట్టుకుని, ట్రిమ్ముగా తయారయి- మాసిపోయిన గెడ్డంతో బయల్దే రారు. ఇదెప్పుడైనా జరిగిందా? ఒకరోజు యేకంగా జుత్తు దువ్వుకోకుండానే రోడ్డుపైకి వెళ్ళిపోయారు. అప్పుడు ఓ బలమైన నిర్ణయానికి వచ్చాను" ఆమె చెప్పడం ఆపింది. ముందుకు సాగమన్నట్లు సంజ్ఞ చేశాడతను. తీవ్రమైన వేగిరపాటుకి లోనవడం వల్ల అతడి కణతల్లోని నరాలు ఉప్పొంగాయి. "నా సంసా రాన్ని నిలబెట్టుకోవాలని తీర్మానించాను. స్క్రిబ్లింగ్ ప్యాడ్‌పై ఎవరిదో ఫోన్ నెంబర్ నోట్ చేసుకున్నారు. అది తప్పనిసరిగా ఓ స్త్రీకి చెందినదే అయుంటుందని ఊహించాను. ఆపదకు పాపం లేదంటారు. ఓనాడు తెగించి మీ డైరీని కూడా చదివాను. విషయాన్ని కొంత వరకు అర్థం చేసుకున్నాను. మరికొంత ఊహించుకో గలిగాను. ఆమె విడాకులు పుచ్చుకుని మీ నుంచి వేరవుతున్నప్పుడు ఆమెకు చెందాల్సిన విలువైన వస్తువులు ఆమెకు చేరనివ్వకుండా మొండిచేయి చూపించి ఉంటారనుకున్నాను. అందుకని నావి కాని

వన్నీ ఆమెవే అయుంటాయని తీర్మానించి- బీరువా లోపలి సొరుగులోంచి బంగారు వడ్డాణం- వజ్రాల నెక్లెస్- రెండు ఆడాళ్ళ బ్రేస్‌లెట్లు- చేతి ఉంగరాలు తీసుకెళ్ళి- అన్నీ ఆమె ముందుంచి- "మీవి మీరు తీసుకుని మా వారిని ఇబ్బంది పెట్టడం మానుకోండి మేడమ్" అని గట్టిగా అని అత్తగారు నా పేర వ్రాసి వెళ్ళిన రెండెకరాల మాగాణి కూడా ఆమెకిచ్చేస్తా నన్నాను. అంటే ఆ భూమి కూడా ఆమెకు చెందినదైతే- "ఆమె చెప్పడం ఆపేసింది. రామచంద్రమూర్తి ఓసారి బరువుగా నిట్టూర్చి- ప్రక్కనున్న మట్టి కూజా నుంచి నీళ్ళు పోసుకుని తాగి- మౌనముద్ర వహించి కూర్చున్న భార్యనుద్దేశించి అన్నాడు- "ఏమయింది- అలా మ్రాన్పడి కూర్చున్నావు? ఆవిడ నీ ఆఫర్‌కి ఎలా స్పందించింది?"

"ఏమీ అనలేదు. లేచి వచ్చి నన్ను గట్టిగా కౌగ లించుకుంది."

"అవును. ఆవిడ అటువంటి చేష్టలు చేయడంలో ఘటికురాలు. ఇట్ ఈజ్ ఎ డిప్లొమేటిక్ మూవ్!"

"అక్కయ్య అటువంటిదని నాకనిపించడంలేదండి" ఈ మాటలు విని అతను నెత్తిన నిప్పుల్ని పోసుకున్నట్లు కస్సున ఎగిరిపడ్డాడు. "పుచ్చిపోయిన పుచ్చకాయ ల్లాంటి సంబంధాలు నా ముందు ప్రస్తావించకు రుక్మిణీ. నువ్వు దాని మాయాజాలంలో మునిగి తేలి నట్లున్నావు. ఆవిడ లోకమెరిగిన స్త్రీ. తెల్ల మనసులతో తెల్లగా- అనునయంగా- నల్ల మనసులతో నల్లగా దౌత్యపరంగా మాట్లాడడం ఆమెకు ఉగ్గుపాలతో నేర్చిన విద్య. ఆవిడ కౌగలి సాధారణమైనది కాదు. ధృత రాష్ట్రుని మరణ ఆలింగనం. ఇంకెప్పుడూ నా వద్ద ఇలా మాట్లాడకు." ఈసారి రామచంద్రమూర్తి మోతాదుకి మించిన రీతిన పాషాణాన్ని గొంతు ముడిలో నింపుకొని కటువుగా అన్నాడు. రుక్మిణి ముఖం వెలవెల పోయింది. "ఆమెపై కోపోద్రిక్తత ఉండటంలో న్యాయం ఉంది. కాదనను. కాని..." ఆమె అర్థోక్తిలో ఆగిపోయింది.

"కాని...?" మిగతాది వెల్లడించమని స్వరస్థాయిని హెచ్చించి అడిగాడు.

"ఈ ఒక్క విషయంలో మాత్రం అక్కయ్య- సారీ- ఆవిడ కృత్రిమంగా ప్రవర్తించడం లేదని నా అంతరాత్మ చెపుతోందండి"

"ఏ విషయంలో?"

"కారుణ్యను మీకప్పగించే విషయంలో"

"అదెవరు?"

"మీ పెద్ద కూతురండీ!"

"ఆవిడ నాకు భార్య కానప్పుడు- ఆవిడ కడుపున పుట్టిన నలుసు మాత్రం నాకెలా కూతురవుతుంది? దాని కూతురు మనింట్లో ఉండి ఉంటే- మా అమ్మ ఈపాటికి బ్రతికే వుండేది కదా! అయినా నీకు సంబంధం లేని విషయాలలో ఈ పెద్దరికం యేమిటి? నీ సంసారాన్ని నువ్వు నిలబెట్టుకోవాలని తీర్మానించా నన్నావు. అలా చేయడానికి అదేనా పద్ధతి!"

రుక్మిణి హతాశురాలై మాటలు దొరక్క కళ్ళు మిటకరిస్తూ ఉండిపోయింది. ఎందుకో ఆమెకే తెలి

## పనస తొనలు

**తూ**ర్పు సారించుగుణమది తొగరు లతిక
కొసలు వంగిన ధనువున కుట్మలించె
తత్త్వమనుభూతి నిష్యంద తరుణమైన
వెలుగు పుంజమ్ము లాత్మయై వెల్లివిరిసె!

పెద్దమనసున సత్యసంబద్ధయౌచు
శిశిర మాకాశ హృదయ వైశేషికాంశ
పల్లవిత వర్ణ రచనేచ్ఛ పార్థివమును
ఊర్ధ్వపుండ్రమ్ము చేసిన ఇష్టిఋతము!

ఆకు చాటున సిగ్గుతో అలరు మొగ్గ
ఎడము కట్టెను కొమ్మతో; జడను విరియ
విరిసి అసియాడు మల్లెల వీచులమరి
పూత రవళుల మాదిరి పిందె కూత!

పచ్చి చెక్కిళ్ళపై అరవిచ్చుకొన్న
నవ్వు మొగ్గల నవకమ్ము నాట్యమాడ
చూపు తాటించు నావైపు చూచి నవ్వె
అర్ధ విస్పష్ట లజ్జా స్వనాంచితముగ!

కోకిలము కూసె నొక మావి గొంతునెత్తి
తరుణ మంజుల ప్రణయ గీతములు తోచె
పనస తొనలను పలుకుల పంచిబెట్ట
చిలుకస్వామికి ఎడదలో చిన్న కోర్కె!

పదము నందలి నవభావ పరిమళమ్ము
అలరు కుచ్చుల పాగలో వసువునందె
జీవమయమైన రసముపాసించునట్టి
సుకవి హృదయాన చైత్రమ్ము సుంకుదేలి!

-సాంధ్యశ్రీ

## హైకూలు

కష్టాల కన్నీళ్ళప్పుడు
పెదవి మిత్రుడు
దేవుడు
ప్రేమ కరువై
గుప్పెడంత గుండెకు
ఎన్ని కష్టాలో
రెండక్షరాల హైకూ
చీకటిని తరిమే
లాంతరు
హెచ్.ఐ.వి.కి
చేరకు దరి
అది నీ పాలిట ఉరి
బోరుకు గొంతెండింది
అవును మరి
వేసవి కాలం
నీ చూపుతో
విచ్చుకుంది ప్రేమకాదు
నా ప్రాణం కూడా
చెలి పిలుపు
బలం ముందు
సెలైన్ బలం సున్న
ఫ్యాక్టరీలో నడిచేవి
పేదల రెక్కల
యంత్రాలు
పంజరంలో
చిక్కుకున్నది
చిలుక కాదు స్వేచ్ఛ
ఫ్యాక్టరీల ద్వారాలు
బాల కార్మికుల
ఆహ్వానాలు
ప్రగతి పంచసూత్రాలు
గోడలకే
పరిమితం
అలసిన శరీరానికి
ఆసరా చెట్టే కాదు
అమ్మ...

-ఈ వేమన

యదు- కళ్ళ నుంచి కన్నీరు చూరునుంచి జాలువారే ధారలా ప్రవహిస్తోంది. అప్పుడు "నాన్నగారూ!" అన్న గొంతు విని అతడు తలెత్తి చూశాడు. గుమ్మానికి ఆనుకుని పుష్పలత తమ్ముడి ప్రక్కన నిల్చుని తేరిపార చూస్తోంది. ఏమిటన్నట్లు చూస్తూ కూతుర్ని దగ్గరకు రమ్మని పిలిచాడు. పుష్పలత తను కాదన్నట్లు తల అడ్డంగా ఆడిస్తూ- అతడ్ని వెనక్కి చూడమని చేయి చూపించింది. అతడికి అదేమీ పాలుపోక వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ కారుణ్య కన్నీరు కారుస్తూ వెక్కి వెక్కి ఏడుస్తూ నిలుచుంది. "ఎవరమ్మా?" అనే లోపల ఆ పిల్ల ఒక్క పరుగున వచ్చి తండ్రి రెండు కాళ్ళూ చుట్టేసుకుంది. అతడికేమీ అర్థంకాక అయోమయంగా చూడసాగారు. "మీరు పెద్దవాళ్ళు. మీ జగడాలలో నాకున్న సంబంధం యేమిటి నాన్నా! నేను చేసిన తప్పేమిటి- నన్నింతగా ద్వేషిస్తున్నారు." అతడి రెండు చేతులూ అతడికి తెలియకుండానే పెద్ద కూతురి నెత్తిని స్పర్శించాయి. "నేను కోర్టులో బామ్మతోనే ఉంటానన్నాగా! కోర్టు వారు నా మాట కాదని నన్ను అమ్మకు అప్పగిస్తే అది నా తప్పా నాన్నా?" రామచంద్రమూర్తికి మాటలు కరువయాయి. అతడికి తెలియకుండానే అతడి కళ్ళనుంచి కన్నీటి చుక్కలు రాలిపడసాగాయి. "ప్లీజ్ నాన్నగారూ! చిన్నమ్మను ఏమీ అనకండి. ఈ విషయంలో చిన్నమ్మ చేసిందేమీ లేదు. నేను అమ్మనిక్కడ దిగబెట్టమని మారాంచేసి వచ్చేశాను."

అంతవరకూ గుమ్మానికావల నిల్చున్న కొడుకూ కూతుళ్లిద్దరూ చెంగు చెంగున తండ్రి చెంత చేరి తండ్రిని వాటేసుకున్నారు.

రుక్మిణీ వాళ్లను తదేకంగా చూస్తూ- తడిసిన గుండెను అదుముకుంటూ- "థేంక్సండీ!" అని గొణిగినట్లు అంది.

❖ ❖ ❖

కారుణ్య తండ్రి వద్దకు చేరిన మూడు రోజుల తరువాత రుక్మిణీకి కబురందింది- దీపాంకిత సీరియస్ కండీషన్‌లో జర్మన్ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేరిందని- ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉందన్న విషయం విని అచేతనంగా ఉండిపోయింది. ఏమి చేయాలో- ఎవరికి చెప్పాలో పాలుపోక ఆమె మెదడు గడ్డకట్టుకు పోయినట్లనిపించింది.

దీపాలు పెట్టేవేళ దాటింతర్వాత- పూజాగదిలో దూపదీప నైవేద్యాలు సమర్పించిన పిదప గుండె దిటవుపర్చుకుంటూ భర్తకోసం హాలువేపు వచ్చిందామె.

అక్కడ భర్తలేరుగాని- ఎవరో పెద్ద వయసులో ఉన్న దంపతులిద్దరూ సోఫాలో కనిపించారు. కారుణ్య వాళ్ళను అంటిపెట్టుకుని బిక్కుబిక్కుమంటూ చూస్తూ కనిపించింది. చినతల్లిని చూసి ఒక్క ఉదుటున లేచి వచ్చి పెన వేసుకుంది. వచ్చిన వాళ్లెవరో గుర్తించ గలిగింది రుక్మిణి. ఇప్పుడుగాని భర్త వాళ్ళను చూస్తే లీకవుతున్న సిలెండరని కుంపటి ప్రక్కన పెట్టినట్లవు తుందేమో! కారుణ్య తల నిమురుతూ వాళ్ళ వద్దకు వెళ్లి నమస్కరించింది. ఆమెను చూసి ఇద్దరూ లేచి ఏదో విషయాన్ని వివరిస్తున్నారు. ఆ లోపల రామచం ద్రమూర్తి అక్కడికి వచ్చి తలెత్తి కూడా చూడకుండా- "కారుణ్యా! వాళ్ళను వెళ్ళమను. మనం వాళ్ళ వెంబడి వస్తున్నామని చెప్పు. కబురు నాకు కూడా అందింది" అన్నాడు. అతడి మాటలు విని దీపాంకిత తల్లిదండ్రు లిద్దరూ తల వంచుకుని నిష్క్రమించారు.

రుక్మిణి మాత్రం వాళ్ళ వెంబడి వెళ్లి, కారు వరకూ సాగనంపి వచ్చింది. వాళ్ళు కారులో వెళ్ళిపోయిన చప్పుడు గమనించి కారుణ్య పరుగున వచ్చి తండ్రిని వాటేసుకుంది ఏడుస్తూ.

❖ ❖ ❖

రెండ్రోజుల పాటు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి, మూడోరోజు కాస్తంత కుదుటపడిన తరువాత దీపాంకితను ఏసీ రూములోకి మార్చారు. ఆ రోజంతా ఆమె ఓ విధమైన ఉక్రోషానికి లోనవుతూ, సన్నటి మూల్గుతో కళ్ళు విప్పకుండానే పడుకుంది.

రామచంద్రమూర్తి భార్యతో పాటు ఆస్పత్రిలోకి ప్రవేశించేటప్పటికి వార్డు ముందు కంపెనీ ఉద్యోగులు, సీనియర్ ఆఫీసర్లు ఆందోళనతో నిల్చున్నారు. రూమ్ ఇన్‌చార్జి నర్సు రామచంద్రమూర్తిని, రుక్మిణితో పాటు కారుణ్యను మాత్రం పోనిచ్చి- ఎక్కువగా మాట్లాడకూడ దని హెచ్చరించింది. మెడికల్ ఆఫీసర్ గోడవైపు చూపు సారించాడు- నిశ్శబ్దం పాటించమన్న బోర్డుని చూపిస్తూ. అతడ్ని చూసి పడకకు యిరువైపులా స్టూళ్ళపై కూర్చున్న దీపాంకిత తల్లిదండ్రులిద్దరూ లేచి నిల్చుని ప్రక్కలకు తప్పుకున్నారు. రామచంద్రమూర్తి వాళ్ళను పరామర్శించలేదు. కనీసం ముఖాన సౌమ్యత కూడా చూపించలేదు. అన్నివిధాలా వాళ్ళతనికి అపరిచితులు. రుక్మిణి మాత్రం అక్కడి బరువైన స్తబ్దతని భంగం చేస్తూ మెడికల్ ఆఫీసర్‌ని బొంగురు గొంతుతో అడిగింది. "కేసు ప్రోబ్లమ్ మాకంతగా తెలియదు డాక్టర్. ఏమయింది- ఇంత సీరియస్‌గా పరిస్థితి ఎందుకు తయారయింది?" డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ఆమెను రూము మూలకు రమ్మనమని సంజ్ఞ చేసి- కుదురైన మాటల్ని అల్లుకునేందుకు రవంత సేపు తీసుకుని మెల్లగా అన్నాడు- "నెర్వస్ బ్రేక్‌డౌన్. కాళ్ళూ చేతులూ దాదాపు చచ్చుబడి పోయాయి. యథాస్థితికి రావడానికి రోజులు పట్టొచ్చు- నెలలు కూడా పట్టొచ్చు. అదీను అన్నీ కలిసొస్తేనే! పూర్తి నెర్వస్ బ్రేక్ డౌన్ అన్నమాట. అలా అనడానికి పెక్కు కారణాలు చెప్పవచ్చు. ఒక ముఖ్యమైన కారణం- డీప్ డిప్రెషన్ లోకి వెళ్ళిపోయుంటుంది. ఆమెను త్వరగా కోలుకు నేట్టు చేయమని వాళ్ళ కంపెనీ చైర్మన్‌గారు బలంగా రిక్వెస్టు చేశారు. ఆమెగారు లేకపోవడాన ఓ ముఖ్యమైన పాలసీ నిర్ణయం ఆగిపోయిందట. టీమ్ ఆఫ్ డాక్టర్స్‌ని నియమించాం. వాళ్ళందరూ శాయశక్తులా ప్రయత్నిస్తు న్నారు. బహుశః మానసిక పరిస్థితితో బాటు భారీ బిజినెస్ షెడ్యూల్ వల్ల కూడా ఆమె ఆరోగ్య స్థితి దెబ్బతిని ఉండవచ్చు. ఇటువంటి సీరియల్ ప్రాబ్లెమ్‌ని టేకప్ చేయగల ఒక వైద్య నిపుణుడు స్విట్జర్లాండ్‌లో ఉన్నారు. అతనికి కూడ కబురు పంపాం."

ఈలోపల- అంతవరకూ చెక్కుచేదరకుండా నిల్చున్న కారుణ్య అకస్మాత్తుగా తల్లి పడకవైపు దూసుకు వెళ్ళింది. "అమ్మా, అమ్మా! నాన్నగారు వచ్చారే నిన్ను చూడటానికి. కన్ను తెరవవే అమ్మా! అని యేడుస్తూ గట్టిగా పిలిచింది. అది విని అతి కష్టంపై కళ్ళు తెరవ డానికి ప్రయత్నించింది. కొండంత నిస్సత్తువను పారద్రోలుతూ ఊపిరి ఎగబీలుస్తూ కళ్ళు పెద్దవి చేసుకుని రామచంద్రమూర్తి వైపు తల తిప్పింది. ముఖాన మెరిసిన సన్నటి హాసరేఖ ఎనలేని తేటదనాన్ని నింపింది. రుక్మిణి మెల్లగా కదలి వెళ్లి భర్త చేయి అందిపుచ్చుకుని పడక దగ్గరకు తీసుకు వెళ్లింది. తన చేతితో అతని చేతిని అందుకుని దీపాంకిత నుదట వుంచింది. ఆ చేతిని అందిపుచ్చుకోలని ఎగిసిపడ్డ ఆమె మనసుని ఏమాత్రమూ గుర్తించని ఆమె రెండు చేతులూ అచేతనంగా కదలిక లేకుండా అలాగే పడి ఉన్నాయి. కొన్ని జతల కళ్లు కన్నార్పకుండా వారిరువురినీ తదే కంగా చూడసాగాయి. ఎట్టకేలకు రామచంద్రమూర్తి నోరు తెరిచాడు.

"ఐ యామ్ సారీ దీపా!" ఆ ఒక్క మాటలోనూ ఏమి దాగివుందో మరి- విచ్చుకున్న ఆమె కళ్ల నుంచి కన్నీటి చుక్కలు బొటబొటా రాలిపడసాగాయి.

■